క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్‌లో రైల్వేలైన్‌పై వెళ్తున్న పురాతన హెచ్‌టీ 33 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి రైలుపట్టాల కింద నుంచి అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. ఈనెల 3న మండలంలోని శివునిపల్లి, ఇప్పగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ బోరుబావులు, త్రీఫేజ్ సరఫరా వాడుతున్న వాణిజ్య వినియోగదారులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ రాంబాబు, ఏఈ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులకు సింగిల్‌ఫేజ్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని వారు కోరారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గం ఎన్నిక



దేవరుప్పుల: మండల ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నికున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ ఆదేశానుసారం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి డాక్టర్ మదంశెట్టి వరూధిని, పర్యవేక్షకులు గన్ను నర్సింహులు తెలిపారు. ఆదివారం అధ్యక్ష పదవికి నామినేషన్లు వేయగా ఒకేఒక నామినేషన్ ఈరుకుల శ్రీనివాస్ వేయగా అతన్ని అధ్యక్షుడిగా ధృవీకరిస్తూ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా జిల్లా విభాగం కార్యదర్శి గంగిశెట్టి అనూజ, ప్రధాన కార్యదర్శి గన్ను నర్సింహులు, రీజియన్ చైర్మన్ పడకండి రవీందర్, జిల్లా యూత్ అధ్యక్షుడు గజ్జి సంతోష్‌కుమార్, వాసవీసేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్ల సోమయ్య, జోన్ చైర్మన్ మాశెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నర్మెట : మండలంలోని ఆగాపేటకు చెందిన గౌరబోయిన మహేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ రూ. ఒక లక్ష ఎల్‌ఓసీ ఆదివారం అందించారు. ఆయన వెంట నాయకులు వెంకటయ్య, చంద్రమౌళి, వెంకటేష్, ఉపేందర్, మల్లేశం, సిద్దులు, మల్లయ్య, శాంతికుమార్, రాములు పాల్గొన్నారు.

జనగామ రూరల్: పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పసరమడ్లకు చెందిన నిరుపేద కుటుంబానికి రూ. 1.25 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, సత్యనారాయణరెడ్డి, మహేందర్ రెడ్డి, సిద్దయ్య ఉన్నారు.

విద్యార్థికి ప్రతిభా పురస్కారం

దేవరుప్పుల : మండలకేంద్రంలోని శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన 4వ తరగతికి చెందిన విద్యార్థి యామ శివ ప్రతిభా పురస్కారం సాధించినట్లు హెచ్‌ఎం పాండు కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ కూకట్‌పల్లి లోని పీఎస్‌ఎం హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి అబాకస్ అండ్ వేదిక్ మ్యాథ్స్ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. శివను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

విహారయాత్రకు విద్యార్థులు

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రకు ఆదివారం తరలివెళ్లారు. జిల్లాలో ఉన్న చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, జంతు ప్రదర్శనలను పిల్లలకు చూపించి వారిలో మానసికోల్లాసం, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విహారయాత్ర చేపట్టినట్లు హెచ్‌ఎం తిరుమల్‌రాజు తెలిపారు. ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

యాదవ సంఘం కమిటీ

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేట యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా మంద రాజయ్య ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికై నారు. ఉపాధ్యక్షులుగా అబ్బరబోయిన పాపయ్య, ప్రధాన కార్యదర్శిగా మార్క కుమారస్వామి, కార్యదర్శులుగా మంద రాజు, మధు, కోశాధికారిగా కొమురయ్య ఎన్నికయ్యారు.

మార్కండేయ జయంతి



నర్మెట : భక్త మార్కండేయ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉత్సవాలను ఆదివారం జరుపుకున్నారు. మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధ్యక్షులు చింతకింది సు రేష్, ఉపాధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి వీరమల్లు, సహాయ కార్యదర్శి రాజు,సత్యనారాయణ, గోవర్ధన్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌కు నోచని అంకుషాపూర్

- ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆశావహులు
- రాబోయే ఎన్నికల్లో కేటాయించాలని గ్రామస్తులు వేడుకోలు

తరిగొప్పుల : రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులకు అనుగుణంగా కల్పించాల్సిన రిజర్వేషన్ల కేటాయింపు గ్రామానికి నేటికి వర్తించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామపంచాయతీ ఏర్పడి దాదాపు 55 ఏళ్లు గడుస్తున్నా జీపీ ఎన్నికల్లో నేటికి సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించలేదు. ఎస్టీ వర్గానికి చెందిన ఒక్క కుటుంబం ఉన్న గ్రామంలో సైతం సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించి 206కు పైగా జనాభా ఉన్న అంకుషాపూర్‌లో ఎస్సీ రిజర్వేషన్ కేటాయించకపోవడంపై ఆ వర్గానికి చెందిన వారు కాసింత అసహనానికి గురవుతున్నారు. రికార్డుల ప్రకారం.. దాదాపు 1970–75 కాలంలో అంకుషాపూర్ గిరిజన తండాలు కలుపుకొని గ్రామ పంచాయతీగా ఏర్పడింది. నాటి నుంచి నేటి వరకు 10 మంది బీసీ, ఎస్టీ, ఓసీ వర్గానికి చెందిన సర్పంచ్‌లుగా ఎన్నికవడం జరిగింది. గ్రామపంచాయతీ ఏర్పడిన సంవత్సరంలో బీసీ వర్గానికి చెందిన నాగపూరి రామస్వామి మొదటి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తర్వాత బట్టు లింగారెడ్డి(ఓసీ), బానోతు వెంకటి (ఎస్టీ, రెండుసార్లు), నాగపూరి సత్తయ్య (బీసీ), బానోతు భూలి (ఎస్టీ), ముక్కెర అయిలయ్య (బీసీ), కర్ర మోహన్‌రెడ్డి (ఓసీ), ఎర్రోజు భిక్షపతి (బీసీ), ముక్కెర బుచ్చిరాజ్‌యాదవ్ (బీసీ) సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. నేటి లెక్కల ప్రకారం అంకుషాపూర్ గ్రామజనాభా 2,350 ఉండగా, ఓటర్లు 1366 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 687, మహిళా ఓటర్లు 680 ఉన్నారు. కాగా బీసీ ఓటర్లు 1107, ఎస్టీ ఓటర్లు 46, ఓసీ ఓటర్లు ఏడుగురు ఉండగా ఎస్సీ ఓటర్లు 206 మంది ఉన్నారు. అయినప్పటికీ జీపీ ఎన్నికల్లో గత 50 ఏళ్లుగా సర్పంచ్ ఎన్నికలో ఎస్సీ రిజర్వేషన్ ప్రకటించడం లేదని సర్పంచ్‌గా పోటీ చేయాలని ఆశిస్తున్న ఎస్సీ వర్గానికి చెందిన పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి త్వరలో రాబోయే సర్పంచ్ ఎన్నికలో అంకుషాపూర్‌కు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని పలువురు కోరుతున్నారు.



అంకుషాపూర్ జీపీ కార్యాలయం

ఈసారైనా కేటాయించాలి



గ్రామం ఏర్పడిన నాటి నుంచి సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించలేదు. ప్రభుత్వం కులగణన చేపట్టింది. 206 ఎస్సీ జనాభా ఉన్నందున జీపీకి ఈసారైనా సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలి.

– బక్క చిరంజీవి, అంకుషాపూర్

స్థలాన్ని ఆక్రమించుకునే వారిపై చర్య తీసుకోవాలి

చిల్పూరు : మండలంలోని రాజవరంలో దళితులకు చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకునే వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం దళితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుల పెద్ద మనుషులు ఎడ్ల కొంరయ్య, మహిపాల్, డీలర్ మల్లయ్య, ఎడ్ల ప్రమోద్, ఎడ్ల శ్రీనులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామంలో కొన్నేళ్ల క్రితం దళితులు ఎవరైనా మృతి చెందితే గ్రామ సమీపంలో దహన సంస్కారాలు చేసే వారు. అక్కడి భూమి సాగుకు ఉపయోగపడడంతో గ్రామానికి చెందిన పాగాల సుధాకర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆ సమయంలో ఇక్కడి భూమికి బదులు మీకు శ్మశాన వాటిక ఏర్పాటుకు సర్వే నంబర్ 81,82లో ఉన్న 4 ఎకరాలు వాడుకోవాలంటూ భూబదలాయింపులో ఇచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే శ్మశాన వాటిక ఉంటోంది. ఇటీవల సుధాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డిలు శ్మశాన వాటికకు ఇచ్చిన భూమి తమ పేరునే ఉందని అందుకు తమకే చెందుతుందని అర్ధరాత్రి ప్రొక్లయినర్లతో తవ్వకాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న తాము అడ్డుకోవడం జరిగిందని ఈ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.



శ్మశాన వాటిక వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

సీపీఐ సభను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్ : ఈ నెల 4న జనగామలో సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలి పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్ పిలుపునిచ్చారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ అవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు అనేక ప్రజాపోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని ప్రజా పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు పార్టీ రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండి యాకూబ్‌పాషా, ఖాజామియా, మహబూబ్‌జానీ, విష్ణుసూర్జన్, శమినాబేగం, సాంబలక్ష్మి, మశ్రీనా, సజ్జన్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

స్నేహితురాలికి ఆర్థికసాయం




లింగాలఘణపురం: జ్యోతికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

లింగాలఘణపురం: మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన కొత్తపల్లి కిరణ్(35) ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య జ్యోతికి పదో తరగతి 2001–02 పూర్వ విద్యార్థుల బ్యాచ్ ఆదివారం రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అదే విధంగా బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కన్నయ్య ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సాయం చేయడమే కాకుండా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని పూర్వవిద్యార్థులు, గ్రామస్తులు భరోసా ఇవ్వడంతో పలువురు అభినందించారు.

తరిగొప్పుల : ఇటీవల సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఎడ్లబండ్ల ఊరేగింపులో చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండల కేంద్రానికి చెందిన ఎనమల్ల ప్రవీణ్ కుమార్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్ ఆదివారం పరామర్శించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సింగిల్ విండో మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, థామస్, గాలయ్య, మైఖేల్, ఉదయ్‌కిరణ్, దాసు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



కొడకండ్ల : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝూన్సీరెడ్డి కోరారు. మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఝూన్సీరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, పాల్గొన్నారు.

ధర్మతండా రోడ్డు పనులకు మోక్షం

దేవరుప్పుల : గత ప్రభుత్వం ప్రారంభించిన ధర్మతండా రోడ్డు నిర్మాణ పనుల వివాదాస్పదానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝూన్సిరెడ్డి చొరవతో పరిష్కారానికి మోక్షం కలిగింది. ఈ క్రమంలో రోడ్డు దారికి స్థలం రామచంద్రాపురం చెందిన కెత్వాల నర్సయ్య కుటుంబ సభ్యులకు సంబంధించిన భూమి నుంచి రోడ్డు పోసే క్రమంలో తండావాసులు ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సదరు భూబాధితులు రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝూన్సిరెడ్డి చొరవతో తండాకు రోడ్డు పనులు కొనసాగేలా పరిష్కారం చేశారు. తండా అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా ఉండాలని సూచించారు. రోడ్డుకు స్థలం ఇచ్చిన రైతుకుటుంబంతోపాటు ప్రజాప్రతినిధులకు ధర్మతండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

6వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

జనగామ రూరల్ : పట్టణంలోని బాణాపురం బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలంటూ సీపీఎం చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బూడిది ప్రశాంత్, పాము భిక్షపతి మాట్లాడుతూ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

రైతుల పాలిట శాపంగా కేంద్ర బడ్జెట్

జనగామ రూరల్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజలను వంచన చేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసేలా రైతుల పాలిట శాపంగా బడ్జెట్ ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప, దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదని విమర్శించారు.

నిధుల కోసం కృషి చేయని మంత్రులు

స్టేషన్‌ఘన్‌పూర్ : తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు తెలంగాణకు బడ్జెట్‌లో నిధులు వచ్చేలా ఎలాంటి కృషి చేయలేదని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మి 8 ఎంపీ సీట్లు ఇ స్తే బడ్జెట్‌లోప్రజలకు చిప్ప చేతికి ఇచ్చారని విమర్శించారు.

సభ కరపత్రాల ఆవిష్కరణ

దేవరుప్పుల: జనగామలోని కామాక్షి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాలను కడవెండి, సీతారాంపురం, మాదాపురం గ్రామాల్లో ఆదివారం ఆవిష్కరించారు.

రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

బచ్చన్నపేట : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ కోరారు. ఆదివారం పీఏసీఎస్ భవనంలో ఆయన మాట్లాడుతూ మా బ్యాంకులో 26 గ్రామ పంచాయతీల నుంచి 1285 మంది సభ్యత్వాలను తీసుకున్నారని అన్నారు. స్వల్పకాలిక రూ.7 కోట్లు, దీర్ఘకాలిక రుణాలను రూ.87 లక్షలు తీసుకున్నారని తెలిపారు. రుణాలను తీసుకున్న రైతులు వాయిదాలను సకాలంలో చెల్లిస్తే మరి కొంత మంది నూతన రైతులకు రుణాలను అందించే అవకాశం ఉంటుందన్నారు. మండల కేంద్రంలోనే బంగారంపై రుణాలను అందించడానికి వీలుగా నూతన భవనాన్ని నిర్మించామని త్వరలోనే ఆ బ్యాంకు ద్వారా సేవలను అందిస్తామని తెలిపారు. అలాగే నూతన సభ్యత్వాలను తీసుకునే వారు కూడా తీసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ కాశ బాలస్వామి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

జనగామ రూరల్ : మండలంలోని యశ్వంతపూర్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయిలో ప్రజ్ఞోత్సవ పోటీల్లో మరిగడి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు అత్యుత్తమ ప్రతభను కనపరిచారు. ఎంఈఓ వంగాల రాజేందర్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్స్, కృష్ణమూర్తి, వీరాంజని విజేతలకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేణుకుంట్ల మురళి , స్టీఫెన్, గైడ్ టీచర్ సాంబరాజు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజిత పాల్గొన్నారు.

ఓటీఎస్‌తో రుణ విముక్తి

పాలకుర్తిటౌన్ : మొండి బకాయిలతో ఇబ్బంది పడుతున్న బకాయిదారులకు ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) ద్వారా రుణ విముక్తి లభించనుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు పాలకుర్తి బ్రాంచ్ మేనేజర్ ఏ.సమీర్‌కుమార్ తెలిపారు. ఈ నెల 28 వరకు ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గూడూరులో అ'పూర్వ'సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాలకుర్తి : మండలంలోని గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 1989–1990 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎంఈఓ పోతుగంటి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 35 ఏళ్లగా విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. పాఠశాలకు రూ.53 వేల ఆర్థిక సాయం ఇచ్చారు. కార్యక్రమంలో భిక్షపతి, పూజారి రమాకాంత్, గందె భిక్షపతి, యాదగిరి, ఏకాంబరం, అయిలయ్య, సదాలక్ష్మి, రజిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి మానవహక్కుల సంఘం పేరుతో మా వద్ద డబ్బులు డిమాండ్‌చేస్తూ వేధిస్తున్నాడని గ్రామానికి చెందిన ముక్కెర రవి, ముక్కెర రాజు, ఒంటెల రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత నెల 26న మా వ్యవసాయ భూమి వద్దకు కొందరితో వచ్చిన సదరు వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నాడని, రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అతడి డిమాండ్‌కు తలొగ్గక పోవడంతో అక్రమకేసులు పెట్టి వేధిస్తున్నాడని, ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టి తగిన న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు చెవుల యాదగిరి, బూరు నరేందర్, పులిగిల్ల గట్టయ్య, బెల్లపు వెంకటస్వామి, ఎల్లారెడ్డి, గండి రాజు, రాజిరెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పండ్ల షాపు దగ్ధం



జనగామ రూరల్ : ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పండ్ల షాపు దగ్ధమైన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలో కోల రమేశ్ పండ్ల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పండ్ల షాపునకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్‌ఇంజన్ సాయంతో మంటలు ఆర్పారు. సుమారు రూ.60 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు రమేశ్ తెలిపారు. ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరాడు.

కురుమలు రాజకీయంగా చైతన్యం కావాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్

స్టేషన్‌ఘన్‌పూర్ : కురుమలు రాజకీయంగా చైతన్యం కావాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేష్, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి ఒగ్గు రవి, ఉపాధ్యక్షుడు ఆలేటి రాజు అన్నారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కురుమలకు సముచిత స్థానం కల్పిస్తూ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్ తదితర స్థానాల్లో మెజార్టీ స్థానాల్లో అవకాశం ఇవ్వాలన్నారు. రానున్న ఎన్నికల్లో కురుమలకు సముచిత స్థానం కల్పించిన పార్టీలకే మా మద్దతు ఉంటుందన్నారు. గ్రామస్థాయి నుంచి కురుమలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

మండల కమిటీ ఎన్నిక

రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో కురుమ సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఒగ్గు రాజు, ప్రధాన కార్యదర్శిగా శెవ్వాల కుమార్, ఉపాధ్యక్షుడు చెట్కూరి రవి, కోశాధికారి వెంకటేష్, ప్రచార కార్యదర్శి పెద్దిబాబు, సహాయ కార్యదర్శులు అమరాజు కుమార్, కోటి, తిరుపతి, వెంకన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



నూతన కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

యుద్ధభేరి సభకు తరలిన ముదిరాజ్‌లు

జఫర్‌గఢ్ : బీసీల రాజ్యాధికారం, ఆత్మగౌరవం కోసం తలపెట్టిన బీసీ యుద్ధభేరి సభకు జఫర్‌గఢ్ నుంచి ముదిరాజ్‌లు పలు వాహనాల్లో పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు. వీరితో పాటు ఆయా గ్రామాలకు చెందిన వివిధ కులాలకు చెందిన బీసీలు పలు వాహనాల్లో తరలివెళ్లారు. సభకు తరలిన వా రిలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సీహెచ్. సోమనర్సయ్య, నీలం రాజయ్య, అన్నెబోయిన నాగరాజు, సందీప్, కొమురెల్లి, సిహెచ్.కుమార్, జంపయ్య, నీలం రమేశ్ పాల్గొన్నారు.

పాలకుర్తి : వరంగల్ బీసీ గర్జనకు పాలకుర్తి మండలం గూడూరు, వల్మిడ గ్రామాల నుంచి రెండు బస్సుల్లో ఆదివారం తరలి వెళ్లారు. నియోజకవర్గ ముదిరాజ్ ఇన్‌చార్జ్ చిక్కుడు రాములు, గ్రామం ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు నారబోయిన యాకయ్య, చిక్కుడు పెద్ద రాములు, వల్మిడి సంఘం కుమార్, చంద్రయ్య, ఏడునూతుల డైరెక్టర్ రాఘవులు, మొండ్రాయి గ్రామ నాయకుడు గోవర్ధన్, ఎం. కుమార్ బస్సుల్లో తరలివెళ్లారు.



పాలకుర్తి : సభకు తరలివెళ్తున్న ముదిరాజ్‌లు

గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా పెంచాలి

జఫర్‌గఢ్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి పట్టాపురి సదయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంఘం నాయకులు, గీత కార్మికులు గౌడ జన హక్కుల క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత వృత్తిపై అధారపడి జీవనం సాగిస్తున్న గౌడ కులస్తులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాటిచెట్టు ఎక్కే ప్రతి గీత కార్మికుడికి 18 ఏళ్ల తర్వాత గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని పెట్టాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు మేర్గు నర్సింగం, నాయకులు దుద్దుల కొమురెల్లి, వడ్లకొండ సమ్మయ్య, రమేష్, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, ఎల్లగౌడ్, దాసు, కృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఆలయ నిర్మాణానికి విరాళం

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్‌లోని శ్రీతిరుమలనాథ స్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆయానికి మాజీ ఎంపీటీసీ గోనెల ఉపేందర్–లత దంపతులు తమ వంతుగా రూ.1,00,116 విరాళంగా అందించారు. ఉపేందర్ మాట్లాడుతూ హనుమాన్ భక్తుడిగా తన వంతుగా స్వామివారి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూజారి కలకోట రామానుజాచార్యులు, భక్తులు కుంభం నరేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ ఉపేందర్ దంపతులు